
సాక్షి
కృష్ణాజిల్లా
మంగళవారం । 4 । ఫిబ్రవరి । 2025






## 1,05,330 మిర్చి బస్తాల విక్రయం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 1,20,593 మిర్చి బస్తాలు వచ్చాయి. ఈ-నామ్ విధానం ద్వారా 1,05,330 బస్తాలు విక్రయించారు.



## సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 550.20 అడుగుల వద్ద ఉంది. కుడికాలువకు 9,330 క్యూసెక్కులు విడుదలవుతోంది.



## సుబ్బారాయుడి సేవలో కృష్ణా ఎస్పీ

మోపిదేవి: స్థానిక శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణోత్సవంలో కృష్ణా జిల్లా ఎస్పీ గంగాధరరావు దంపతులు పాల్గొన్నారు.

# కేంద్రం చేతికే వైస్ చాన్స్‌లర్

- ఆ దిశగా యూజీసీ ముసాయిదా నిబంధనలు
- గవర్నర్ల చేతుల్లోకి వీసీల నియామకం నిర్ణయం
- రాష్ట్రంలో 17 వర్సిటీల్లో వీసీలను నియమించే అవకాశం
- కేంద్ర ప్రభుత్వ విధానాలపై విద్యార్థి సంఘాల ఆగ్రహం




గుడ్లవల్లేరు: యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) నిబంధనల ముసాయిదా రాష్ట్ర ప్రభుత్వ అధికారాలను లాక్కునేలా ఉందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. తమ స్వయం ప్రతిపత్తిని విశ్వవిద్యాలయాలు కోల్పోయే ప్రమాదం ఉందని విద్యార్థి సంఘాలు ఆందోళన వ్యక్తంచేస్తున్నాయి. కార్పొరేట్ శక్తుల కబంధ హస్తాల్లోకి విద్యారంగం వెళ్లిపోయే ప్రతికూల పరిస్థితులను కేంద్రం కల్పిస్తోందని పేర్కొంటున్నాయి. ఆ దిశగానే యూజీసీ ముసాయిదా నిబంధనలు ఉన్నాయని స్పష్టంచేస్తున్నాయి. రాష్ట్రంలో 17 యూనివర్సిటీలు ఉన్నాయి. వాటికి వైస్ చాన్స్‌లర్ల నియామకాన్ని ఇక నుంచి చాన్స్‌లర్ హోదాలో ఉండే గవర్నర్‌కు అప్పగించేలా కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ విషయమై ప్రస్తుతం అభిప్రాయ సేకరణ చేపట్టింది. ఆ గడువు ముగియగానే కేంద్రం అనుకున్నదే తడవుగా గవర్నర్ల ద్వారానే వైస్ చాన్స్‌లర్‌ల నియామకాలను చేపట్టనుంది. ఈ విధానాలను విద్యార్థి సంఘాలు వ్యతిరేకిస్తున్నాయి. ప్రభుత్వ నిర్ణయాలను వెనక్కి తీసుకోకపోతే ఉద్యమ బాట తప్పదని ఆ సంఘాల నేతలు హెచ్చరిస్తున్నారు.

**కేంద్రం గుప్పెట్లోకి వర్సిటీలు**

రాష్ట్రాల హక్కులను కాలరాసేందుకు, ప్రభుత్వ యూనివర్సిటీలను మూతవేసే కుట్రలకు యూజీసీ నిబంధనల పేరుతో కేంద్రం తెర తీసిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలో గవర్నర్‌తో పాటు స్థానిక యూనివర్సిటీల్లో వీసీతో పాటు వివిధ సభ్యుల కమిటీ ఉండేది. అప్పట్లో వీసీ నియామకానికి సంబంధించిన తుది నిర్ణయం రాష్ట్రానికే ఉండేది. ఇప్పుడు రాష్ట్రాలను ఉత్సవ విగ్రహాలను చేసి వైస్ చాన్స్‌లర్ల నియామకం అధికారాన్ని గవర్నర్లకు కట్టబెట్టే నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం తీసుకుంది. ఆంధ్రప్రదేశ్‌లో వీసీల నియామకం తమ ప్రభుత్వ ఇష్టమని కనీసం కేంద్రానికి లేఖ కూడా రాయకుండా కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

### ఇది చాలా ప్రమాదకరం

దేశ విద్యారంగంలో వీసీలను గవర్నర్లు నియమించే ప్రక్రియ ప్రమాదకరమన్న వాదనలు విద్యార్థి సంఘాల నుంచి వస్తున్నాయి. విద్యను మరింత కార్పొరేట్ దిశగా చేయాలని బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం భావిస్తోందన్న విమర్శలు ఉన్నాయి. నూతన విద్యా విధానం 2020లో భాగంగా తీసుకొస్తున్న ప్రతిపాదనలు ప్రాథమిక సూత్రాలను ఉల్లంఘించినట్లుగా ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. విద్యా విధానంలో రాష్ట్రాల హక్కులను దెబ్బ తీసి, వర్సిటీల స్వయం ప్రతిపత్తిని అణిచి వేయటమే లక్ష్యంగా యూజీసీ నిబంధనలు ఉన్నాయని విద్యార్థి సంఘాలు పేర్కొంటున్నాయి. యూజీసీ నిబంధనలతో రాష్ట్రాల హక్కులను కేంద్రం కాలరాస్తోందని, ఈ విద్యా విధానాలను వ్యతిరేకిస్తున్న రాష్ట్రాల్లో వీటిని బలవంతంగా అమలు చేసే కుట్రలకు తెగబడుతోందని ఆరోపిస్తున్నాయి. ఇండియన్ నాలెడ్జ్ సిస్టమ్స్ (ఐకేఎస్)ను ప్రమోట్ చేయాలన్న దృక్పథంతోనే కేంద్ర ప్రభుత్వం ఇదంతా చేస్తోందని వివరిస్తున్నాయి. విద్యపై హక్కు రాష్ట్రాలకే ఉండాలని తమిళనాడు, కేరళ రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న కృషి అమోఘమైనదని ఈ సందర్భంగా పేర్కొంటున్నాయి. రాష్ట్రాలు తమ ప్రత్యేక సామాజిక, రాజకీయ, సంస్కృతి, ఆర్థిక అంశాలకు అనుగుణంగా విద్యా విధానాలను రూపొందించుకుంటాయి. అయితే కేంద్రం యూజీసీ నిబంధనల సాకుతో రాష్ట్రాల్లో విద్యా వ్యవస్థ నిర్వహణపై దాడి చేసే అవకాశాలు ఉన్నాయని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

### విద్యార్థులు ఉద్యమించాలి



భారత దేశంలోని విశ్వ విద్యాలయాల నియంత్రణ అంశం కార్పొరేట్ శక్తులకు లాభదాయక సాధనంగా మారనుంది. అలా మారక ముందే విద్యార్థులు ఉద్యమ బాట పట్టాలి. మనం ఉన్నత విద్యను పెంచుకోవాలంటే యూజీసీ ముసాయిదాను విద్యావేత్తలు, విద్యార్థులు తిరస్కరించాలి.

– ఎం.సాయికుమార్, ఏఐఎస్ఎఫ్ ఏపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

### రాజ్యాంగంపై యూజీసీ దాడి



తమ విద్యా హక్కులను తామే తమ రాష్ట్రాల్లో వినియోగించుకుంటామని పలు రాష్ట్రాలు చెబుతున్నాయి. యూజీసీ ముసాయిదా పేరిట తీసుకుంటున్న చర్యలు పరిపాలనా పరమైన సమస్య కాదని చెప్పినా, రాజ్యాంగ నిర్మాణంపై దాడి చేసేందుకు కేంద్రం వెనుకాడటంలేదు.

– గుజ్జుల వలరాజు, ఏఐఎస్ఎఫ్ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు

దివ్యాంగ ధ్రువపత్రాల పునఃపరిశీలన కోసం వేచివున్న లబ్ధిదారులు



# పింఛన్‌ల తొలగింపునకు రంగం సిద్ధం!

- మచిలీపట్నం జీజీహెచ్‌లో సదరం ధ్రువపత్రాల పునఃపరిశీలన
- ఆందోళన చెందుతున్న దివ్యాంగ పింఛన్‌దారులు

మచిలీపట్నంటౌన్: దివ్యాంగుల పింఛన్‌ల తొలగింపునకు రాష్ట్ర ప్రభుత్వం వేస్తున్న అడుగులు జీజీహెచ్‌కు చేరాయి. ఇప్పటి వరకూ జిల్లా వ్యాప్తంగా రూ.15 వేల పింఛన్ పొందుతున్న లబ్ధిదారుల ఇళ్లకు అధికారులు వెళ్లి పరిశీలించే ప్రక్రియను నిర్వహించారు. సోమవారం నుంచి వివిధ రకాల దివ్యాంగ పింఛన్లు పొందుతున్న వారి సదరం ధ్రువీకరణ పత్రాల పునఃపరిశీలన ప్రక్రియను స్థానిక ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ప్రారంభించారు. మచిలీపట్నం నగరంతో పాటు పలు ప్రాంతాల్లో దివ్యాంగ పింఛన్లు పొందుతున్న వారు ధ్రువపత్రాల పునఃపరిశీలనకు హాజరై తనిఖీ చేయించుకోవాలని సచివాలయ సిబ్బంది ఇప్పటికే నోటీసులు ఇచ్చారు. దీంతో వారంతా సోమవారం జీజీహెచ్‌కు చేరుకుని తమ సర్టిఫికెట్లను పునఃపరిశీలన చేయించుకున్నారు. అంధ, చెవిటి, మానసిక దివ్యాంగ పింఛన్‌లు పొందుతున్న వారు ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున హాజరయ్యారు. వారి సర్టిఫికెట్లను ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వైద్యులు పునఃపరిశీలన చేశారు. సర్టిఫికెట్ల పునఃపరిశీలన నేపథ్యంలో తమకు వస్తున్న పింఛన్ ఇక నుంచి అందుతోందో లేదోనని లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.

**దివ్యాంగులకు ఇబ్బందులు**

సర్టిఫికెట్ల పునఃపరిశీలనకు వచ్చిన పింఛన్‌దారులు ఓపీ చీటీ తీసుకురావాలని తొలుత అధికారులు ప్రకటించారు. ఓపీ చీటీ కోసం క్యూలో నిలబడేందుకు దివ్యాంగులు ఇబ్బంది పడ్డారు. వారి బాధలను గమనించిన జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ డి.ఆశాలత ఓపీ చీటీ నుంచి మినహాయింపు ఇచ్చారు. దీంతో దివ్యాంగులు ఊపిరిపీల్చుకున్నారు. వచ్చిన దివ్యాంగులకు తాగునీటి వసతి లేకపోవటం, సూచిక బోర్డులు లేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

### పునఃపరిశీలన తప్పనిసరి

జిల్లాలో వివిధ రకాల దివ్యాంగ పింఛన్‌దారులు అందరికీ సదరం ధ్రువీకరణ పత్రాల పునఃపరిశీలన ప్రక్రియ జరుగుతోందని జిల్లా ప్రభుత్వాస్పత్రుల సమన్వయకర్త (డీసీహెచ్ఎస్) జయకుమార్ 'సాక్షి'కి తెలిపారు. ప్రతి సోమ, మంగళ, బుధ వారాల్లో జీజీహెచ్‌లో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన దివ్యాంగ పింఛన్‌దారులు ఈ శిబిరానికి వచ్చి సంబంధిత విభాగం డాక్టర్లతో వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. రోజూ 75 మంది వినికిడి, 80 మంది కంటి, 50 మంది మానసిక దివ్యాంగుల సర్టిఫికెట్లను వైద్యులు పునఃపరిశీలన చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమం నెల రోజుల పాటు కొనసాగుతుందని వివరించారు.

## న్యూస్‌రీల్

### సహకార సంస్థల ద్వారా మెరుగైన సేవలు



చిలకలపూడి(మచిలీపట్నం): సహకార సంస్థల ద్వారా మెరుగైన సేవలు పొందేలా చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ డి.కె.బాలాజీ తెలిపారు. తన చాంబర్‌లో జిల్లా సహకార అభివృద్ధి కమిటీ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ బాలాజీ మాట్లాడుతూ.. 2025 సంవత్సరాన్ని ఐక్య రాజ్య సమితి అంతర్జాతీయ సహకార సంవత్సరంగా ప్రకటించిన నేపథ్యంలో సహకార సంస్థలు మెరుగైన ప్రపంచాన్ని నిర్మిస్తాయనే అంశంపై ముందుకెళ్తున్నట్లు తెలిపారు. ఈ విషయంపై సహకార అధికారులతో కలెక్టర్ చర్చించారు. ప్రతి నెలా చేపట్టాల్సిన కార్యక్రమాలపై నివేదిక అందజేయాలన్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల కంప్యూటరీకరణ ద్వారా పెట్రోల్ బంకుల నిర్వహణ, ప్రధానమంత్రి భారతీయ జన ఔషధి కేంద్రాల నిర్వహణ, మల్టీ పర్పస్ ఫెసిలిటీ సెంటర్ల నిర్మాణాలపై కలెక్టర్ అధికారులతో చర్చించారు. ఈ సమావేశంలో జిల్లా సహకార అధికారి వి.వి.ఫణికుమార్, జిల్లా వ్యవసాయాధికారి ఎన్.పద్మావతి, కేడీసీసీబీ సీఈఓ ఎ.శ్యామ్‌మనోహర్, డీఎస్ఓ వి.పార్వతి, జిల్లా పరిషత్ డెప్యూటీ సీఈఓ ఆర్.సి.ఆనంద్ కుమార్, జిల్లా పరిశ్రమల అధికారి ఆర్.వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

### కుమ్మర్ల నైపుణ్యాలను పెంపొందించుకోవాలి



నున్న(విజయవాడరూరల్): గృహోపకరణాల తయారీలో కుమ్మర్లు నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ఖాదీ అండ్ విలేజి ఇండస్ట్రీస్ కమిషన్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.గ్రీప్ అన్నారు. కుంభర్ సశక్తికరన్ ప్రోగ్రామ్ అవగాహన కార్యక్రమం సోమవారం నున్న గ్రామంలోని కుమ్మరి బజారులో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డైరెక్టర్ డాక్టర్ ఎస్.గ్రీప్ మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని ఆకర్షణీయమైన గృహోపకరణాలను తయారు చేసినట్టయితే ఆదాయాన్ని మరింత పెంచుకోవచ్చని సూచించారు. కేంద్ర ప్రభుత్వం ప్రతి కుమ్మరి కుటుంబానికి రూ.25వేలు విలువ చేసే సారె ఉచితంగా ఇవ్వాలని నిర్దేశించిందన్నారు. మట్టిని కలుపుకునే మిషన్లు అందజేయాలని కుమ్మర్లు డైరెక్టర్‌ను కోరారు. సదస్సులో అసిస్టెంటు డైరెక్టర్లు వి.కోటిరెడ్డి, ఆర్ఎల్ఎన్ మూర్తి, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ సాంబయ్య, ఆనంద్ కుమార్, ఎగ్జిక్యూటివ్ ఇ.తేజవర్ధన్ యాదవ్ పాల్గొన్నారు

### రైతులు నష్టపోకుండా రీ సర్వే నిర్వహణ

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ



మైలవరం: రైతులు నష్టపోకుండా చేయడానికే రీ సర్వే చేస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. మైలవరం మండలం జంగాలపల్లి గ్రామంలో రైతు శీలం శ్రీనివాసరెడ్డి వ్యవసాయ భూమిని రోవర్ యంత్రం ద్వారా పరిశీలించి కొలతలు వేయించారు. కొన్ని ప్రాంతాల్లో రైతులు తమ వ్యవసాయ భూములు అన్యాక్రాంతానికి గురవుతున్నాయని తమ దృష్టికి తీసుకు రావడంతో రీ సర్వే కార్యక్రమం పక్కాగా నిర్వహించి సదరు రైతులకు సంబంధిత భూములు అప్పగిస్తామన్నారు. అనంతరం కలెక్టర్ తిరిగి వస్తూ ఉండగా గ్రామ మహిళలు ఆయన కారు వద్దకు వచ్చి తమ సమస్యలు తెలుపుకొన్నారు. వెంకటేశ్వరరావు అనే రైతు తనకు గతంలో ప్రభుత్వం వ్యవసాయ భూమి రెండెకరాలు ఇచ్చిందని, దానికి పట్టా కూడా ఇచ్చారని, అయితే ఈ భూమిని తీసుకోవడానికి కొంత మంది ప్రయత్నిస్తున్నారని తనకు న్యాయం చేయాల్సిందిగా విన్నవించుకున్నాడు. తహసీల్దార్ అబ్దుల్ దరియాను ఈ సమస్య పరిష్కరించాల్సిందిగా కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అనూరాధ, రెవెన్యూ సిబ్బంది, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఐదేళ్లలోపు పిల్లలకు ఆధార్ నమోదు

కలెక్టర్ బాలాజీ



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలో ఐదేళ్లలోపు పిల్లలకు ఆధార్ నమోదు కార్యక్రమంపై అవగాహన కల్పించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ డి.కె. బాలాజీ ఆదేశించారు. జిల్లా స్థాయి ఆధార్ పర్యవేక్షణ కమిటీ సమావేశాన్ని కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఐదు నుంచి ఏడు, 15 నుంచి 17 ఏళ్ల మధ్య వయసున్న వారి ఆధార్‌ను తప్పనిసరిగా బయోమెట్రిక్ అప్‌డేట్ చేయాలని, దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లాలో 38 వేల వరకు ఆధార్ నమోదు ప్రక్రియ పెండింగ్‌లో ఉన్నట్లు నివేదికలు చెబుతున్నాయన్నారు. ఐదేళ్లు పైబడిన, 15 నుంచి 17 ఏళ్ల మధ్య వయసు వారు తప్పనిసరిగా బయోమెట్రిక్ అప్‌డేట్ చేసుకోవాలని, ఇందుకు ఎటువంటి రుసుం చెల్లించాల్సిన అవసరం లేదని స్పష్టంచేశారు. ఆస్పత్రిలో పుట్టగానే పిల్లలకు ఆధార్ నమోదుపై దృష్టిపెట్టాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో రిజిస్టరయిన వెంటనే తప్పనిసరిగా సర్టిఫికెట్ తెప్పించి ఆధార్ నమోదు చేయించాల్సిన బాధ్యతను స్త్రీ, శిశు సంక్షేమశాఖ అధికారులు తీసుకోవాలన్నారు. చిన్నారుల ఆధార్ నమోదులో ఎదురవుతున్న ఇబ్బందులను పరిష్కరించేందుకు డేట్ ఆఫ్ బర్త్ లేని వారి వివరాలను సేకరించాలన్నారు. ఈ సమావేశంలో డిస్ట్రిక్ లెవల్ ఆధార్ మానిటరింగ్ కమిటీ కన్వీనర్, కేఆర్ఆర్‌సీ స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ బి.శ్రీదేవి, యూఐడీఏఐ అసిస్టెంట్ మేనేజర్ జి.గిరిధర్, ఎల్‌డీఎం సి.రవీంద్రరెడ్డి, సీడీపీఓ కె.గ్లోరి పాల్గొన్నారు.

# కనుల పండువగా కార్తికేయుని కల్యాణం



మంగళసూత్రాలను చూపుతున్న వేదపండితులు



ఆలయం వెలుపల ఎదురుకోలు ఉత్సవం

మోపిదేవి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న మోపిదేవిలో శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దివ్య కల్యాణ మహోత్సవం సోమవారం రాత్రి కనుల పండువగా జరిగింది. వేలాదిగా హాజరైన భక్తులు స్వామివారి కల్యాణ వేడుకను కనులారా తిలకించి పులకించారు. తొలుత ఆలయం వెలుపల భక్తుల సమక్షంలో ఎదురుకోలు ఉత్సవం జరిగింది. వేదపండితులు, దేవదాయశాఖ అధికారులు రెండు వర్గాలుగా స్వామివారు, అమ్మవార్ల పక్షాన వాదప్రతివాదనలు చేశారు. చలోక్తుల మధ్య ఈ ఉత్సవం ఆసక్తికరంగా నిర్వహించారు. అనంతరం అమ్మవార్లను వేదమంత్రాలు, మంగళ వాయిద్యాలతో ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కల్యాణ మండపం వద్దకు తోడ్కొని వచ్చారు. ఫ్లడ్ లైట్లు వెలుగుల మధ్య స్వామి కల్యాణం దేదీప్యమానంగా కొనసాగింది. అనంతరం వేదపండితులు శాస్త్రోక్తంగా కల్యాణ వేడుక జరిపించారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం పోటెత్తింది. ఉదయం ఆలయ కార్యనిర్వహణాధికారి దాసరి శ్రీరామ వరప్రసాదరావు ఆధ్వర్యంలో వేదపండితుడు కొమ్మూరి ఫణికుమార్ శర్మ, ఆలయ ప్రధానార్చకుడు బుద్ధు పవన్‌కుమార్ శర్మ బ్రహ్మత్వంలో సుప్రభాత సేవ, ప్రాతఃకాలార్చన వంటి పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారుల ప్రదర్శించిన నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. అవనిగడ్డ డీఎస్పీ విద్యశ్రీ ఆధ్వర్యంలో ఎస్ఐ సత్యనారాయణ పోలీస్ సిబ్బందితో బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

# సామూహిక అక్షరాభ్యాసం.. సరస్వతీ కటాక్షం



సకలేశ్వరస్వామి ఆలయంలో సరస్వతీదేవి అలంకారంలో అమ్మవారు



భావదేవరపల్లిలో సామూహిక సరస్వతీపూజ చేస్తున్న బాలికలు

మోపిదేవి: స్థానిక శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం, స్థానిక శ్రీ సకలేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం వసంత పంచమిని ఘనంగా నిర్వహించారు. కార్తికేయుని ఆలయ కల్యాణ మండపంలో, సకలేశ్వరస్వామి ఆలయంలో అక్షరాభ్యాస వేడుక జరిగింది. ఆయా ఆలయాల కార్యనిర్వహణాధికారులు దాసరి శ్రీరామ వరప్రసాదరావు, జోగి ప్రవీణ ఆధ్వర్యంలో వేదపండితులు బుద్ధు ఫణికుమార్ శర్మ, పెళ్లూరి వెంకటేశ్వరరావు చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. అక్షరాభ్యాసం అనంతరం చిన్నారులు, వారి తల్లిదండ్రులు పుట్టలో పాలు పోసి స్వామివార్లను దర్శించుకున్నారు.

**భావదేవరపల్లి విశ్వేశ్వరస్వామి ఆలయంలో..**

భావదేవరపల్లి(నాగాయలంక): స్థానిక శ్రీఅన్నపూర్ణదేవి సమేత శ్రీకాశీ విశ్వేశ్వరస్వామి దేవస్థానంలో మాఘ వసంత పంచమిని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు కొల్లిపర సుబ్బారావు బ్రహ్మత్వంలో అమ్మవారు, అయ్యవార్లకు వినాయకస్వామికి విశేష అభిషేకాలు జరిపారు. ఈ సందర్భంగా గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులు, గ్రామ బాలికలు 200 మంది సామూహిక సరస్వతీపూజ చేశారు. అన్నపూర్ణదేవిని పెన్నులతో సరస్వతీదేవిగా అలంకరించారు. వినాయకుడి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు చేశారు. వ్యవస్థాపక ధర్మకర్తలు పూషడపు నిరంజనరావు, శివసత్యవతి దంపతులు, మెండు సాయిరామ్, సర్పంచ్ మండలి ఉదయభాస్కర్ వేడుకలను పర్యవేక్షించారు.

## విజయకీలాద్రిపై గరుడ హోమం

తాడేపల్లి రూరల్: గుంటూరు జిల్లా, తాడేపల్లి పట్టణ పరిధిలోని సీతానగరం విజయకీలాద్రి దివ్య క్షేత్రం 8వ వార్షికోత్సవాల్లో భాగంగా రెండో రోజు సోమవారం స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్‌స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో ఉదయం 8.30 గంటలకు ధ్వజారోహణ, అగ్ని ప్రతిష్ఠ, గరుడ హోమం అంగరంగ వైభవంగా నిర్వహించామని తెలిపారు. సాయంత్రం 6.30 గంటలకు దేవతాహ్వానం, శేష వాహనంపై స్వామిని ఊరేగించామని చెప్పారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారని ఆయన తెలిపారు.

### ఘనంగా విద్యుత్ రైళ్ల శతాబ్ది ఉత్సవాలు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): భారతీయ రైల్వేలో విద్యుత్ రైళ్ల వందేళ్ల చారిత్రక మైలురాయిని చేరుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని విజయవాడ డివిజన్‌లో శతాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. విజయవాడ రైల్వే స్టేషన్ నుంచి పలు పాఠశాలల విద్యార్థులతో కలసి నిర్వహించిన వాక్‌థాన్‌ను డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్ జెండా ఊపి ప్రారంభించారు. తూర్పు బుకింగ్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ఫొటో గ్యాలరీని ప్రారంభించిన అనంతరం డీఆర్ఎం మాట్లాడుతూ.. విద్యుత్ రైళ్ల వినియోగం చారిత్రక విప్లవమని అభివర్ణించారు. దేశంలో తొలిసారిగా విద్యుత్ రైలు 1925, మార్చి మూడో తేదీన విక్టోరియా టెర్మినల్ నుంచి ఛత్రపతి శివాజీ మహారాజ్ టెర్మినల్ మధ్య విజయవంతంగా పరుగులుపెట్టిన సందర్భాన్ని డీఆర్ఎం గుర్తు చేశారు. కార్బన్ ఉద్గారాలను తగ్గించే లక్ష్యంతో భారతీయ రైల్వేలో విద్యుద్దీకరణ దిశగా 'మిషన్ ఎలక్ట్రిఫికేషన్ – 2030' కార్యక్రమంతో విద్యుద్దీకరణ ప్రాజెక్ట్‌లు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడీఆర్ఎం కొండా శ్రీనివాసరావు, సీనియర్ డీఈఈ దినేష్‌రెడ్డి, స్టేషన్ డైరెక్టర్ శైలజ, పలువురు అధికారులు, సిబ్బంది, పలు పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యుద్దీకరణ ఫొటో గ్యాలరీని తిలకిస్తున్న డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్

# యుద్ధప్రాతిపదికన కృష్ణా జలాలు



ఏకొండూరులో తాగునీటి ప్రాజెక్టు పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

తిరువూరు: ఎ.కొండూరు మండలంలోని కిడ్నీ వ్యాధి ప్రభావిత 38 గ్రామాల ప్రజలకు శాశ్వత ప్రాతిపదికన కృష్ణాజలాలను అందించేందుకు యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టినట్లు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. సోమవారం ఎ.కొండూరులో రూ.50కోట్లతో ప్రభుత్వం చేపట్టిన తాగునీటి సరఫరా ప్రాజెక్టు పనులను కలెక్టరు పరిశీలించారు. ఓవర్ హెడ్ రిజర్వాయర్ స్థితిగతులతో పాటు 200 కిలోమీటర్ల మేర పైపులైన్ల పనుల ప్రగతి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆయా గ్రామాల్లో గతంలో ఉన్న ఓవర్ హెడ్ ట్యాంకులకు అదనంగా నిర్మిస్తున్న 14ట్యాంకుల పనులు వేగవంతం చేయాలని, నిర్దేశిత లక్ష్యం మేరకు పనులు పూర్తవ్వాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. ఈ ఏడాది మార్చి నాటికి 15 ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణం పూర్తి చేస్తామని, జూన్ నాటికి ఇంటింటికీ కుళాయి నీరందిస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ సూపరింటెండింగ్ ఇంజినీర్ విద్యాసాగర్ తెలిపారు. కలెక్టర్ వెంట తిరువూరు రెవెన్యూ డివిజనల్ అధికారిణి కె.మాధురి, గ్రామీణ నీటిసరఫరా విభాగం తిరువూరు డివిజనల్ ఇంజినీర్ రాఘవేంద్ర, జేఈ లక్ష్మి పాల్గొన్నారు.

# పోలీసు డైరీ ఆవిష్కరించిన ఎస్పీ



పోలీసు డైరీని ఆవిష్కరిస్తున్న ఎస్పీ గంగాధరరావు తదితరులు

కోనేరుసెంటర్(మచిలీపట్నం): ఆంధ్రప్రదేశ్ పోలీసు అధికారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ముద్రించిన 2025 పోలీస్ డైరీని ఎస్పీ ఆర్.గంగాధరరావు సోమవారం రాత్రి తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ డైరీ పోలీసుశాఖకు ఉపయుక్తంగా ఉంటుందన్నారు. పోలీసులకు ఓ మార్గదర్శక గ్రంథంలా దోహదపడుతుందని పేర్కొన్నారు. పోలీసుశాఖకు సంబంధించి సమగ్ర సమాచారంతో తయారుచేసిన డైరీని ఆవిష్కరించటం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ ఎస్పీ బి.సత్యనారాయణ, ఏఎస్పీ వి.వి.నాయుడు, ఏఓ ఎం.ఎం.సుబ్రహ్మణ్యం, స్పెషల్‌బ్రాంచ్ సీఐ శ్రీనివాసరావు, వెల్ఫేర్ ఆర్ఐ రాఘవయ్య, రాష్ట్ర పోలీసుల సంక్షేమ సంఘం కార్యదర్శి మస్తాన్‌ఖాన్, పోలీస్ అసోసియేషన్ సభ్యులు విజయపాల్, బెనర్జీ తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### పౌరసరఫరాల శాఖ కమిషనర్ దృష్టికి రేషన్ డీలర్ల సమస్యలు



కమిషనర్‌కు సమస్యలను వివరిస్తున్న సంక్షేమ వేదిక ప్రతినిధులు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): రేషన్ డీలర్ల సమస్యల పరిష్కారం నిమిత్తం ప్రతి నెల నాల్గవ శుక్రవారం రేషన్ డీలర్ల సంఘం ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేస్తానని రాష్ట్ర పౌరసరఫరాల కమిషనర్ సౌరబ్ గౌర్ చెప్పారని రాష్ట్ర రేషన్ డీలర్ల సంక్షేమ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ముత్యాల శేషగిరిరావు తెలిపారు. నగరంలోని పౌరసరఫరాల శాఖ కమిషనర్ కార్యాలయంలో సోమవారం ఆయనను కలిసి రేషన్ డీలర్ల సమస్యలపై వినతిపత్రం అందజేశామని శేషగిరిరావు ప్రకటనలో పేర్కొన్నారు. రేషన్ డీలర్లకు 2015 నుంచి రావాల్సిన ఐసీడీఎస్, ఎండీఎం కమీషన్‌ను వెంటనే విడుదల చేయాలని, రూట్ ఆప్టిమైజేషన్ పేరుతో రేషన్ షాపులను ఒక గోడౌన్ నుంచి మరో గోడౌన్‌ను మార్చడం వల్ల ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. రేషన్ డీలర్ల సంక్షేమ నిధి ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను కోరామని తెలిపారు. కమిషనర్‌కు కలిసిన వారిలో సంక్షేమ వేదిక ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.శివప్రసాద్, ఉపాధ్యక్షుడు యు.వెంకటేశ్వరరావు, విజయవాడ నగర కోశాధికారి పూర్ణ తదితరులు ఉన్నారు.

# కొత్త పింఛన్ల మంజూరుకు చంద్రగ్రహణం

కూటమి ప్రభుత్వంలో కొత్త రేషన్ కార్డులు, పింఛన్ల మంజూరుకు చంద్రగ్రహణం పట్టింది. బోగస్ పేరిట పింఛన్ల కోతకు బాబు ప్రభుత్వం ముందు ఉంటూ... మంజూరుకు మాత్రం వెనుకబడుతోంది. కొత్త రేషను కార్డుల ఊసే ఎత్తడం లేదు. నమోదు ప్రక్రియ చేద్దామంటే నేటికీ వెబ్‌సైట్ కనిపించటం లేదు. కొత్త పింఛన్లు ఇస్తారని ఆశగా ఎదురు చూసిన లబ్ధిదారులకు నిరాశ తప్పడం లేదు. రేషన్ కార్డుల మంజూరులోనూ ఇదే పరిస్థితి నెలకొంది. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడు నెలలు గడుస్తున్నా.. ఇంతవరకు వాటిపై తుది నిర్ణయం తీసుకోలేదు. అసత్య మాటలతో చంద్రబాబు పాలనను నెట్టుకొస్తున్నారు. పింఛన్ల కోత విధించటంలో మాత్రం వేగంగా పని చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితులు చూసిన జిల్లా ప్రజలు మోసపోయామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



- కొత్త రేషన్ కార్డుల ఊసే ఎత్తని కూటమి ప్రభుత్వం
- నేటికీ వెబ్‌సైట్‌లో కనిపించని నమోదు ప్రక్రియ
- కూటమి ప్రభుత్వ విధానంపై పెదవి విరుస్తున్న జిల్లా ప్రజలు

గుడ్లవల్లేరు: ఎన్నికలకు ముందు ఇబ్బడిముబ్బడిగా హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా తుంగలో తొక్కింది. కొత్త పింఛన్లు, రేషను కార్డుల మంజూరు కోసం ఎంతోమంది పేదలు ఏడు నెలల నుంచి ఎదురు చూస్తున్నారు. కానీ ఇప్పటి వరకు పట్టించుకున్న నాథుడే లేకపోయాడు. ప్రస్తుతం కృష్ణాజిల్లాలో 5.33 లక్షల రేషను కార్డులు, 2.37 లక్షల పింఛన్లు ఉన్నాయి. అర్హులైన లబ్ధిదారులు కొత్త పింఛన్లు, కార్డుల కోసం నిత్యం గ్రామ, వార్డు సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ.. నానా అవస్థలు పడుతున్నారు.



**నిలిచిన నమోదు ప్రక్రియ..**

దివ్యాంగులు, వృద్ధులు, వితంతువులు కొత్త పింఛన్ల కోసం ఎదురు చూస్తున్నారు. గత ప్రభుత్వంలో ఈ ప్రక్రియ నిరంతరం సాగేది. గతేడాది ఏప్రిల్ 18న వెబ్‌సైట్‌లో నమోదు ప్రక్రియను నిలిపివేశారు. ఎన్నికల సమయంలో ఎన్నో హామీలు ఇచ్చిన చంద్రబాబు ఇప్పుడు మాత్రం ఏమీ పట్టించుకోవటం లేదు. నేటికీ నమోదు చేపట్టక పోవడంపై జనం నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**రేషన్ కార్డుల మంజూరులోనూ జాప్యమే..**

కొత్త రేషను కార్డుల మంజూరులో కూడా ప్రభుత్వం ఇంత వరకు నిర్ణయం తీసుకోలేదు. ఈ జాప్యంతో వివిధ పథకాల లబ్ధిదారులతో పాటు విద్యార్థులకు కూడా తీవ్ర నష్టం వాటిల్లుతోంది. కార్డులు లేకపోవటంతో పథకాలు అందే పరిస్థితి లేదు. విద్యార్థులకు కాలేజీల్లో కౌన్సెలింగ్, ఫీజు రీయింబర్స్‌మెంట్ ప్రక్రియకు ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం తెల్ల రేషను కార్డులు ఎంతో అవసరం. ఇవి లేకపోతే సర్టిఫికెట్ల జారీలో రెవెన్యూ అధికారులు అడ్డంకులు పెడుతున్నారు. ఇంతవరకు కొత్త పింఛన్లకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఎలాంటి ఉత్తర్వులు లేవని సంబంధిత అధికారులు చెబుతున్నారు. త్వరలో వచ్చే అవకాశం ఉందని అంటున్నారు. ప్రస్తుతం ఉన్న పింఛన్ల వెరిఫికేషన్ జరుగుతుందని, కొత్త రేషన్ కార్డులపై కూడా ఎలాంటి సమాచారం లేదంటున్నారు.

**వైఎస్సార్ సీపీ హయాంలో నిత్య ప్రక్రియ..**

గత వైఎస్సార్ సీపీ హయాంలో కొత్త రేషన్ కార్డులు, కొత్త పింఛన్ల మంజూరు నిత్య ప్రక్రియగా ఉండేది. అర్హులైతే చాలు వలంటీర్లు సచివాలయాల్లో దరఖాస్తు చేయించిందే తడవుగా పైసా ఖర్చు లేకుండా కొత్త రేషన్ కార్డులు, కొత్త పింఛన్లను అధికారులు మంజూరు చేయించేవారు. కేవలం కార్డులు, పింఛన్లే కాకుండా ఆదాయ, కుల, నివాసం వంటి ధ్రువీకరణ పత్రాల్ని సైతం ఉచితంగా అందించి ఎన్నో సేవలు అందించేవారు. కానీ కూటమి ప్రభుత్వం సచివాలయాలను నిర్వీర్యం చేసే ఆలోచనలో ఉంది. మళ్లీ గత సీఎం వై.ఎస్.జగన్ పాలన వంటి పాత విధానం వస్తే.. ఏ సర్టిఫికెట్ కావాలన్నా మండల కార్యాలయాల చుట్టూ రోజుల తరబడి తిరగకుండా ఇంటి ముంగిటకే పాలన వచ్చే పరిస్థితిని కల్పించాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

**పింఛన్ల ఏరివేత...**



దివ్యాంగులు, అవ్వాతాతలు అన్న ఏ మాత్రం కనికరం లేకుండా పింఛన్లను ఏరివేసేందుకు అధికారులను సిద్ధం చేసిన చంద్రబాబు కొత్త పింఛన్లను ఎప్పుడు మంజూరు చేస్తారు? ఒక వేళ ఇచ్చినా...ఈ పింఛన్లను తొలగించి కొత్తగా అదే పింఛన్లను కొత్త వారికి ఇచ్చినట్లుగా లెక్కలు చూపిస్తారు.

– మహ్మద్ బాజీ, గ్రామస్తుడు, డోకిపర్రు

**ప్రజల్లో నమ్మకం లేదు**



చంద్రబాబు ప్రభుత్వంలో రేషను కార్డులు ఇస్తారనే నమ్మకం ప్రజల్లో లేదు. సూపర్ సిక్స్ అమలు చేయటం ఇప్పట్లో కష్టమని బాబు నోటితోనే చెప్పేశారు. తమ కూటమి ప్రభుత్వ ఖజానాలో డబ్బులు లేవని చంద్రబాబు చేతులెత్తేయటంతో జనాల ఆశలపై నీళ్లు చల్లినట్లయ్యింది.

– కొడాలి సురేష్, గుడ్లవల్లేరు ఎంపీపీ

### ఎస్సీ, ఎస్టీ కేసుల సత్వర పరిష్కారానికి చర్యలు

కలెక్టర్ బాలాజీ



చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలో ఎస్సీ, ఎస్టీ కేసుల సత్వర పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో సోమవారం సాయంత్రం ఎస్పీ గంగాధరరావుతో కలిసి జిల్లా విజిలెన్స్ పర్యవేక్షణ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో పౌర హక్కుల రక్షణ, అట్రాసిటీ నివారణ చట్టం తదితర అంశాలపై చర్చించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ పెండింగ్ కేసులు సత్వర పరిష్కారానికి కృషి చేయాలన్నా. అనంతరం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులకు సంబంధించి ఎన్ని చార్జ్‌షీట్లు ఫైల్ చేశారు. ఫైల్ చేయటంలో జాప్యానికి గల కారణాలు, ఇప్పటి వరకు అట్రాసిటీ బాధితులకు నష్టపరిహారం ఎంత అందించారనే వివరాలను డివిజన్ల వారీగా సమీక్షించారు. కేసుల పరిష్కారం కోసం సబ్‌డివిజన్ స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేసి సమీక్షించాలన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల పరిధిలో మాన్యువల్ స్కావెంజర్ల సంక్షేమానికి తీసుకుంటున్న చర్యలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

**సమన్వయంతో పని చేయాలి**

అనంతరం ఎస్పీ గంగాధరరావు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ బాధితులకు తక్షణం న్యాయం జరిగేలా పోలీస్, రెవెన్యూ శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. అవసరమైన వారికి కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేయటంలో తగిన చర్యలు తీసుకోవాలన్నారు. డీఆర్వో కె.చంద్రశేఖరరావు, ఆర్డీవోలు కె.స్వాతి, జి.బాలసుబ్రహ్మణ్యం, బీఎస్ హేలాషారోన్, సాంఘిక సంక్షేమశాఖ డెప్యూటీ డైరెక్టర్ షేక్ షాహెద్‌బాబు, డీఎస్పీలు సీహెచ్ రాజా, విద్యశ్రీ, ధీరజ్‌వినీల్, చలసాని శ్రీనివాసరావు పాల్గొన్నారు.



### కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య



వెంకటనారాయణ మృతదేహం

కాచవరం(ఇబ్రహీంపట్నం): కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన కాచవరం ఇందిరమ్మ కాలనీలో ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఇందిరమ్మ కాలనీలో నివసిస్తున్న చింతల వెంకటనారాయణ(55) లారీ డ్రైవర్. ఇద్దరు కుమార్తెల్లో ఓ కుమార్తెకు వివాహం కాగా మరో కుమార్తె హైదరాబాద్‌లో ప్రైవేట్ జాబ్ చేస్తోంది. ఇంట్లో భార్యతో కలిసి ఉంటున్నాడు. కొన్ని రోజులుగా కుటుంబంలో తలెత్తిన కలహాలతో మనస్తాపానికి గురయ్యాడు. ఇంట్లో భార్య నిద్రిస్తున్న సమయంలో రేకుల షెడ్డు రాడ్డుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సోమవారం తెల్లవారు జామున ఉరికి వేలాడుతున్న భర్తను చూసిన భార్య బోరున విలపించింది. చుట్టుపక్కల వారు విషయాన్ని పోలీసులకు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని విజయవాడ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

### గుర్తు తెలియని వాహనం ఢీ కొని వృద్ధురాలి మృతి

పెడన: 216 జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీ కొని వృద్ధురాలు అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన పెడన పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు తూర్పుతెలుగుపాలెంకు చెందిన మర్రె శేషమ్మ(90) సోమవారం తెల్లవారుజామున పెడన - బంటుమిల్లి 216 జాతీయ రహదారిలో పెడన శివారు చూజీ కంపెనీ సమీపంలో రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. దీంతో ఆమె మృతి చెందింది. అదే సమయంలో ఆ మార్గంలో వెళ్లిన వాహనాలు వృద్ధురాలి మృతదేహంపై నుంచి వెళ్లడంతో నుజ్జునుజ్జైంది. పెడన ఎస్ఐ జి.సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



కృష్ణలంక(విజయవాడతూర్పు): ద్విచక్ర వాహనంపై వెళ్తూ రోడ్డు ప్రమాదానికి గురై ఓ యువకుడు దుర్మరణం చెందిన ఘటన కృష్ణలంక పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు మొగల్రాజపురానికి చెందిన కొప్పుల భరత్‌రాజ్(23) ఇంటర్ పూర్తి చేసి హోటల్ మేనేజ్‌మెంట్ సీటు కోసం ప్రయత్నిస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం అర్ధరాత్రి అతను ద్విచక్ర వాహనంపై బెంజిసర్కిల్ వైపు నుంచి వారధి వైపు జాతీయ రహదారి మీదుగా వేగంగా వెళ్తున్నాడు. జాతీయ రహదారిపై ఉన్న అన్న క్యాంటీన్ సమీపానికి చేరుకోగానే వాహనం అదుపు తప్పడంతో కిందపడిపోయాడు. తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుని తండ్రి మరియన్న ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### బాలుడి ఉసురు తీసిన అతి వేగం



తోట్లవల్లూరు: అతివేగానికి ఓ బాలుని నిండు ప్రాణం బలైంది. అప్పటి వరకు బుడిబుడి అడుగులతో నడయాడుతున్న ఆ చిన్ని హృదయం రెప్పపాటులో బైక్ ప్రమాదానికి గురై అనంతవాయువుల్లో కలిసిపోయింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బొడ్డపాడులో ఆదివారం సాయంత్రం జరిగిన బైక్ ప్రమాదంలో నిమ్మగడ్డ గగన్‌సాయి(3) తీవ్రంగా గాయపడి దుర్మరణం చెందాడు. ఇంట్లో నుంచి బయటకు వచ్చి పెదనాన్న ఇంటికి నడిచి వెళ్లే క్రమంలో, బొడ్డపాడు నుంచి వల్లూరుపాలెం వైపు అతివేగంగా బైక్‌పై వెళుతున్న ముగ్గురు మైనర్ బాలురు బలంగా ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో గగన్‌సాయి తీవ్రంగా గాయపడటంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన విజయవాడలోని ఓ హాస్పిటల్‌కు చికిత్స కోసం తరలించారు. అప్పటికే బాలుడు మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించటంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. ప్రమాదానికి కారకుడైన బాలుడు గతేడాది చినపులిపాక వద్ద కూడా ఓ ట్రాక్టర్ డ్రైవర్‌ను ఢీ కొట్టి, అతని మృతికి కారణమైనట్లు పోలీసులు తెలిపారు. మృతుని తండ్రి నిమ్మగడ్డ కిశోర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అవినాశ్ తెలిపారు.

**ఎమ్మెల్యే వర్ల పరామర్శ..**

గగన్‌సాయి కుటుంబ సభ్యులను పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి, జనసేన ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్, నాయకులు చింతపల్లి వెంకటేశ్వరరావు, నెక్కలపూడి మురళి పరామర్శించారు.

### ఉరి వేసుకుని యువతి ఆత్మహత్య

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఉరి వేసుకుని యువతి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఘటనపై యువతి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చిట్టినగర్ బంగారయ్య కొట్టు సెంటర్‌కు చెందిన ఇల్లా మణికి ముగ్గురు సంతానం. కుమార్తె వనజ(30)కు ఇంకా వివాహం కాలేదు. వనజ కేబీఎన్ కాలేజీలో స్కూటీ నేర్పిస్తూ ఉంటుంది. ఆమెకు కొంత కాలం కిందట జరిగిన అగ్ని ప్రమాదంలో పాక్షికంగా కాలింది. దీంతో పెళ్లి సంబంధాలు కుదరకపోవడంతో మానసికంగా కుంగిపోయింది. గత నెల 31వ తేదీ మధ్యాహ్నం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుంటూ తల్లికి ఫోన్ చేసింది. దీంతో కంగారుగా ఇంటికి వచ్చిన మణి కొన ఊపిరితో ఉన్న వనజను నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించింది. చికిత్స పొందుతున్న ఆమె ఆదివారం రాత్రి మృతి చెందింది. అనుమానాస్పద మృతి కింద పోలీసులు కేసు నమోదు చేశారు.

# కీసర మున్నేటిలో వ్యక్తి మృతదేహం కలకలం

- హత్య చేశారంటున్న మృతుడి బంధువులు
- అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసిన పోలీసులు



కీసర మున్నేటిలో తిరుపతిరావు మృతదేహం

కంచికచర్ల: కీసర మున్నేటిలో యువకుడి మృతదేహం కలకలం రేపింది. మున్నేటిలో బట్టలు ఉతికేందుకు వెళ్లిన వారికి సోమవారం ఓ శవం కనిపించింది. దీంతో వారు పోలీసులకు సమాచారం అందజేశారు. గుంటూరు జిల్లా కోసూరు గ్రామానికి చెందిన నల్లబోతుల తిరుపతిరావు(25) మృతదేహంగా బంధువులు, కుటుంబ సభ్యులు గుర్తించారు. తిరుపతిరావును కొంతమంది హత్యచేసి ఉంటారని పోలీసులకు మృతుడి కుటుంబ సభ్యులు తెలిపారు. కీసర గ్రామానికి చెందిన నల్లబోతుల తిరుపతిరావు గుంటూరు జిల్లా కోసూరు గ్రామానికి చెందిన వెంకటమ్మను ఏడేళ్ల క్రితం వివాహం చేసుకున్నాడు. భార్యభర్తలు ఇద్దరూ కోసూరులోనే ఉంటున్నారు. వారికి ఇద్దరు సంతానం. తిరుపతిరావు తన భార్య ఇద్దరు పిల్లలతో కలిసి ఏడాది క్రితం కీసరలోని తన తల్లి వద్దకు వచ్చారు. రోజు తేనె తొట్టెలు, మునేరులో చేపలు పట్టుకునేందుకు వెళ్తుంటాడు. అయితే గత నెల 31వ తేదీ శుక్రవారం భార్యభర్తల మధ్య చిన్నపాటి ఘర్షణ జరిగింది. దీంతో వెంకటమ్మ తన పుట్టిల్లు అయిన కోసూరుకు పిల్లలతో కలిసి వెళ్లింది. శుక్రవారం నుంచి తిరుపతిరావు కూడా కనిపించటం లేదు. తిరుపతిరావు ఇంటికి రాకపోయే సరికి అతని తల్లి, బంధువులు వెతుకులాట ప్రారంభించారు. సోమవారం సాయంత్రం గ్రామానికి చెందిన కొంతమంది మహిళలు బట్టలు ఉతికేందుకు మున్నేటికి వెళ్లగా అక్కడ ఓ శవం కనిపించింది. వారు పోలీసులకు సమాచారం అందజేశారు. మున్నేరులో ఉన్న మృతదేహం తమ కుమారుడని తిరుపతిరావు తల్లి, అతని బంధువులు బోరున విలపించారు.

**మద్యం తాగి గొడవ..**

తిరుపతిరావు తల్లి, బంధువులు మాట్లాడుతూ.. గ్రామానికి చెందిన కొంతమంది వ్యక్తులు మద్యం తాగి తన కుమారుడిని హత్యచేసి మున్నేటిలో పడేశారని తెలిపారు. గత నెల 31వ తేదీ శుక్రవారం తిరుపతిరావు అతని భార్య వెంకటమ్మ మధ్య చిన్నపాటి గొడవ జరగడంతో ఆమె తన పుట్టింటికి అదే రోజు వెళ్లిందన్నారు. ఆ బాధతో తిరుపతిరావు అదే రోజు ఇంటికి దగ్గరలోని మద్యం షాపునకు వెళ్లి మద్యం సేవించాడు. అదే సమయంలో కీసర గ్రామానికి చెందిన మరో ఇద్దరు వ్యక్తులు మద్యం సేవించారు. మద్యం మత్తులో ఉన్న వారి ముగ్గురు మధ్య చిన్నపాటి ఘర్షణ జరిగింది. దీంతో ఆ ఇద్దరు వ్యక్తులు తిరుపతిరావును తీవ్రంగా కొట్టి, మృతుడు మెడపై తాడుతో ఉరేసినట్లు ఆరోపిస్తున్నారు. తన కుమారుడిని చంపి కీసర మున్నేటిలో పడేసి ఉంటారని మృతుడి తల్లి ఆరోపిస్తున్నారు. అయితే గత నెల 31వ తేదీ జరిగిన విషయం గురించి తిరుపతిరావు కుటుంబసభ్యులు పోలీసులకు తెలిపారు. అనంతరం పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం నందిగామ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు.

### తరగతి గదిలో కుప్పకూలి విద్యార్థిని మృతి

లబ్బీపేట(విజయవాడతూర్పు): శ్రీ దుర్గామల్లేశ్వర సిద్ధార్థ మహిళా కళాశాలలో బీఎస్సీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న అక్కల హర్షిణీ ప్రియ సోమవారం తరగతి గదిలో ఫిట్స్‌తో కుప్పకూలింది. దీంతో కళాశాల యాజమాన్యం ఆమె కుటుంబ సభ్యులకు సమాచారం తెలియజేయగా, ఆమె తల్లి కళాశాలకు చేరుకుని హర్షిణీ ప్రియను అంబులెన్స్‌లో ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. కళాశాల యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగానే విద్యార్థిని మృతి చెందినట్లు ఎస్ఎఫ్ఐ, ఏబీవీపీ కార్యకర్తలు కళాశాల ఎదుట ఆందోళన చేశారు. విద్యార్థిని ఫిట్స్‌తో కుప్పకూలిన వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లకుండా, తల్లి వచ్చే వరకూ పట్టించుకోక పోవడం వలనే మృతి చెందినట్లు వారు పేర్కొన్నారు. విద్యార్థిని మృతిపై సమగ్ర విచారణ జరపాలని ఎస్ఎఫ్ఐ తూర్పు కమిటీ కార్యదర్శి కుమారస్వామి డిమాండ్ చేశారు.

### ఎన్నికల ప్రవర్తన నియమావళిని కఠినంగా అమలు చేయాలి

చిలకలపూడి(మచిలీపట్నం): శాసనమండలి పట్టభద్రుల నియోజకవర్గానికి ఎన్నికల నిర్వహణలో భాగంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కఠినంగా జిల్లాలో అమలు చేయాలని కృష్ణా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. ఇందుకోసం సోమవారం ఆయన నోడల్ అధికారులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికల ప్రక్రియను సక్రమంగా పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఎంసీసీ అమలుకు జిల్లాస్థాయి నోడల్ అధికారిగా జెడ్పీ సీఈవో కె కన్నమనాయుడును నియమించారు. ఈయన ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పర్యవేక్షిస్తారన్నారు. నగరపాలక సంస్థ, నగర పంచాయతీల్లో ఆయా మునిసిపల్ కమిషనర్లు, ఎంసీసీ అమలు పర్యవేక్షణకు నియమించామన్నారు. దీనిలో భాగంగా మచిలీపట్నంలో కార్పొరేషన్ కమిషనర్ సీహెచ్‌వీవీఎస్ బాపిరాజు, గుడివాడలో మునిసిపల్ కమిషనర్ బి.శ్రీనివాసరావు, పెడనలో మునిసిపల్ కమిషనర్ ఎం.గోపాలరావు, వైఎస్సార్ తాడిగడపలో మునిసిపల్ కమిషనర్ పి.భవానీప్రసాద్, ఉయ్యూరులో నగర పంచాయతీ కమిషనర్ పి.వెంకటేశ్వర్లును నియమించారు.

# కోడలి నుంచి కాపాడండి బాబూ



రాములమ్మ, బాధితురాలు

కోనేరుసెంటర్: ఈమె పేరు అలకుంట్ల రాములమ్మ... వయసు 80 సంవత్సరాలు... భర్త రామచంద్రరావు ఆరేళ్ల క్రితం చనిపోయాడు. వీరికి పిల్లలు కలగకపోవటంతో సమీప బంధువుల తరపున ఓ బాబు, పాపను దత్తత తీసుకుని పెంచుకున్నారు. వారిని పెద్ద చేసి పెళ్లిళ్లు చేశారు. కుమార్తెను వేరే ఊరి అబ్బాయికి ఇచ్చి వివాహం చేసి పంపారు. కుమారుడు సీతారామరాజుకు దుర్గ అనే మహిళతో వివాహం జరిపించారు. రామచంద్రరావు తనకు ఉన్న ఆస్తిని పెంచుకున్న కొడుకు పేరిట రాశాడు. మామ రామచంద్రరావు చనిపోయిన నాటి నుంచి భర్త, అత్తను కోడలు తన తరపు బంధువులతో కలిసి హింసలు పెట్టటం ప్రారంభించింది. ఇల్లు తనదని ఇంట్లో నుంచి తల్లి, కొడుకు బయటికి వెళ్లిపోవాలంటూ బెదిరించేది. ఈ విషయంలో తల్లికి కుమారుడు అండగా నిలిచాడు. దీంతో కోడలు తన తరపు బంధువులతో కలిసి రాములమ్మను పలుమార్లు బెదిరించి దాడులు సైతం చేశారు. దీనిపై ఆమె పలుమార్లు ఆర్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు పట్టించుకోకపోగా ఆర్‌పేట సీఐ ఏసుబాబు, మహిళా ఎస్ఐ కలిసి కోడలితో రాజీపడమంటూ రాములమ్మను బెదిరించారు. దీంతో ఆమె తన ఫిర్యాదును వాపసు తీసుకుంది. కోడలు అక్కడితో ఆగకుండా దాడి చేయడంతో పాటు మానసికంగా చిత్రహింసలు పెడుతున్నారు. వారి అకృత్యాలను తట్టుకోలేని ఆమె సోమవారం జిల్లా ఎస్పీ ఆర్ గంగాధరరావును స్వయంగా కలిసి కన్నీరు పెట్టుకుంది. రాములమ్మ కష్టాన్ని చూసి ఎస్పీ చలించారు. మూడు రోజుల్లో బాధితురాలి సమస్యకు పరిష్కారం చూపేలా చర్యలు తీసుకోవాలని ఆర్‌పేట సీఐ ఏసుబాబును ఆదేశించారు. గతంలో ఆమె సమస్యను పట్టించుకోని ఏసుబాబుపై ఎస్పీ సీరియస్ అయ్యారు. బాధితురాలికి న్యాయం చేయకుంటే శాఖాపరమైన చర్యలు తప్పవని సీఐని హెచ్చరించారు.

### పోలీసుల అదుపులో హత్యకు యత్నించిన సుపారీ గ్యాంగ్



నందిగామలో మాట్లాడుతున్న ఏసీపీ తిలక్, వెనుక ముసుగులో నిందితులు

నందిగామటౌన్: ప్రేమ వివాహానికి సహకరించిన వ్యక్తిని హతమార్చేందుకు యత్నించిన సుపారీ గ్యాంగ్‌ను అదుపులోకి తీసుకున్నట్లు ఏసీపీ తిలక్ పేర్కొన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఆయన నిందితులను మీడియా ఎదుట ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. నందిగామ మండలం ఐతవరం గ్రామానికి చెందిన కోలా నరసింహారావు పెద్ద కుమార్తె రమ్య శ్రీ 14 నెలల క్రితం అదే గ్రామానికి చెందిన మువ్వా వీర్రాజును ప్రేమ వివాహం చేసుకుంది. ప్రేమ వివాహానికి వీర్రాజు సమీప బంధువైన ఏ.కొండూరు మండలం కంభంపాడులో జేఎల్‌ఎంగా పని చేస్తున్న మువ్వా గోపీ సహకరించాడని, నరసింహారావు కక్ష పెంచుకున్నాడని తెలిపారు. గోపిని అంతమొందించేందుకు హైదరాబాద్ కొత్తపేటకు చెందిన పాలంపల్లి విజయ్‌కుమార్‌తో రూ.లక్ష సుపారీ ఇచ్చేందుకు ఒప్పందం కుదుర్చుకున్నాడన్నారు. దీంతో విజయ్‌కుమార్, కోలా నరసింహారావులు సంక్రాంతి పండుగ సమయంలో బాణాల గోపిరాజు, చింతగింజ సైదులుతో కలిసి ఐతవరం గ్రామంలోని గోపి నివాసం వద్ద మూడు రోజులు రెక్కీ నిర్వహించినా హత్య చేసేందుకు కుదరలేదన్నారు. ఆదివారం మరలా నలుగురు కలిసి గోపీని హతమార్చే ఉద్దేశంతో నందిగామ పట్టణంలోని మయూరీ థియేటర్ సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుతుండగా సీఐకు వచ్చిన సమాచారం మేరకు ఎస్ఐ సిబ్బందితో వెళ్లి అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. నలుగురిని విచారణ చేసి వారి వద్ద నుంచి నాలుగు కత్తులు, ఒక ద్విచక్ర వాహనం, రెండు వేల నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు. సమావేశంలో సీఐ వీవీఎల్ నాయుడు, ఎస్ఐ అభిమన్యు పాల్గొన్నారు.